కథావేదిక

# శివరాత్రి

**"నా ఏడుపు నాకు తప్ప లోకానికి వినిపించని వేళ.." అని కృష్ణశాస్త్రి ఏ సందర్భంలో, ఎప్పుడు అనుకున్నాడో నాకు తెలియదుగానీ, నరకం లాంటి ఈ బ్రతుకులో నేనా మాటని రోజుకి ఎన్నిసార్లు అనుకుంటానో లెక్కలేదు.**

**చావుబ్రతుకుల సరిహద్దురేఖ చివరి అంచున నిలబడి.. క్షణాలు లెక్కబెట్టుకుంటున్నాను. ఇక ప్రయాణం ముగించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎప్పుడో మృత్యువు నా తలుపు తడుతుంది. అయితే అది ఏ క్షణాన సంభవించబోతోందా అనే ఈ ఎదురుచూపులు...!**

"చాలా సీరియస్.. అయిపోయినట్టే అంటే పరిగెట్టుకొచ్చాం. మూడు రోజులు గడిచిపోయాయి. ముసలాయన అట్లాగే వున్నాడు. ఇలా ఎన్నిరోజులని ఇక్కడ కూర్చుంటాం.." అది పెద్దకోడలు లలిత గొంతు.

"అవును! అవతల ఎన్నోపన్లు వదిలిపెట్టుకొని వచ్చాం. వున్న లీవంతా ఈ ముసలాయనకే ధారపోయాల్సి వస్తోంది.." కోపంగా అంటుంది చిన్నకోడలు సరళ.

"ఈ ముసలాయన పోయేలా లేడు. మనల్ని మాత్రం చంపుతున్నాడు. నాలుగు రోజులకొకసారి ఫోను రావడం.. మనల్ని పరుగులు పెట్టించడం.." విసుగ్గా అంది పెద్దకోడలు.

"అవును.. ఈ తిప్పలు ఇంకా ఎన్నాళ్ళో! ఇంతకీ ఈ ముసలాయన విల్లు రాసాడంటావా?" గుసగుసగా అంటోంది రెండో కోడలు.

"ఏమో ఏం రాసాడో.. అంతా కూతురికి దోచిపెడతాడని నా అనుమానం.." పెద్దకోడలు కోపంగా అంది.

"నా అనుమానమూ అదే.." వంత పాడింది చిన్నకోడలు.

కాలు, చెయ్యి, నోరుతో బాటు నా చెవులు కూడా పని చెయ్యకుండా వుంటే ఎంత బావుండేది! గుండెని తూట్లు పొడిచే ఈ మాటలు నాకు వినబడకుండా ఉండేవి.

నా ముగ్గురు పిల్లల్ని ఎంత కష్టపడి పెంచి పెద్ద చేసాను. వాళ్ళకి మంచి చదువులు చెప్పించేందుకు, మంచి ఉద్యోగాలు వచ్చేంతవరకూ ఎంత తాపత్రయపడ్డాను. నా కన్నే నా వేలు పొడిచినట్టుగా.. నా కడుపున పుట్టిన పిల్లలే నా చావు కోసం ఎదురుచూస్తున్నారు!

అయినా నాకిది తగిన శిక్షేననిపిస్తోంది. చాలా ఏళ్ళక్రితం నా తండ్రి మంచాన కదల్లేని పరిస్థితిలో ఉన్నప్పుడు.. నేను మాత్రం ఇందుకు భిన్నంగా ప్రవర్తించానా? ఆయన్ని పట్టించుకొన్నానా? కనీసం రోజుకోసారైనా పలకరించానా?

నాకిప్పుడు గుర్తు వస్తోంది.

ఎవరూ పలకరించే దిక్కులేక, ఒంటరిగా ఒక మూల గదిలో మౌన పంజరంలో నువ్వు బందీవైనప్పుడు.. నేను ఎప్పుడో ఒక్క నిమిషం మొక్కుబడిగా నీ దగ్గరకి వచ్చినప్పుడు.., నీ కళ్ళల్లో కదలాడిన ఒక ఆర్తి, ఒక ఆవేదన.. ఒక అర్థింపు, ఒక అసహాయత.. అవేమిటో.. వాటికి అర్థమేమిటో, అప్పుడు తెలియలేదు. ఇప్పుడు తెలుస్తోంది- కథ ముగిసిపోయాక!

ఒక చిన్న పలకరింపులేక, ఆప్యాయతలేక.. నీ చల్లని మనసు నీరయ్యిందని, కరిగి పొంగిన కన్నీరైందని, ఎవరికీ వినిపించని రోదనైందని.. అప్పుడెందుకు గ్రహించలేకపోయాను? అనుక్షణం, నాకోసం.. నా భవిష్యత్ కోసం.. నన్నొక ప్రయోజకుడిని చేసేందుకు ఎంత కష్టపడ్డావు? అహర్నిశలూ నా ఉన్నతి కోసం తపించావు. ఎంత ఎత్తున నిలబడి నీ బరువులని ఒంటరిగా లాక్కొచ్చావో తెలియని అజ్ఞానిని ఎలా అయ్యాను?

మానవత్వం శూన్యమవుతున్న మానవ సంబంధాల వ్యవస్థలో.. కన్నకొడుకే మృగంగా మారుతుండడాన్ని.. నీవెలా జీర్ణించుకున్నావు? అంతటి కృతఘ్నతను ఎలా సహించావు!

ప్రతీక్షణం ఒక నరకంగా, చావురాని జీవన శకలంగా.. ఎంత నరకం లాంటి జీవితం! నీ జీవిత చరమాంకంలో నువ్వు అనుభవించిన వేదనా, నిరంతర నిరాదరణ, రోదనా.. ఇప్పుడు నాదైంది. కొన్ని అద్భుత రూపాల విలువ వాటి సాన్నిహిత్యంలో తెలియదు. పోగొట్టుకున్నాడే తెలుస్తుంది.

ఈజిట్ ద ఫిలాసఫీ ఆఫ్ లైఫ్..?

నా ఎదురుగా గోడకున్న వాల్ క్లాక్‌వైపు చూసాను. పదిగంటలు దాటింది. పదైనా, పన్నెండైనా, అర్ధరాత్రి దాటినా నిద్ర మాత్రం నన్ను కరుణించదు. పక్క గదిలోంచి టి.వి. శబ్దాలు, వాటి మధ్య పిల్లల మాటలు వినబడుతున్నాయి.

పెద్దకొడుకు వాసు టి.వి.లోని జోక్‌కు కాబోలు పగలబడి నవ్వుతున్నాడు. పిల్లల నవ్వులు, జోకులు, కేరింతలు, అరుపులు.. నాగది ఎంత నిశ్శబ్దంగా వుందో, ఆ గది అంత సందడిగా వుంది.

నాకు నవ్వొచ్చింది.

వీళ్ళంతా ఒక పెళ్ళికో, పేరంటానికో వచ్చినట్టుందిగానీ, చావుబ్రతుకుల మధ్య నున్న ఒక తండ్రికోసం వచ్చినట్టు లేదు.

వీళ్ళంతా కాస్సేపు నా దగ్గర కూర్చోవచ్చుకదా.. ఆప్యాయంగా మనసు విప్పి మాట్లాడవచ్చుకదా! నా చావుకోసం ఎదురుచూస్తూ, ఈలోపు కాలక్షేపంగా టి.వి. చూస్తున్నారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

నాచుట్టూ కమ్ముకున్న భయంకరమైన నిశ్శబ్దం.. భరించలేకున్నాను.

తలుపు చప్పుడైంది.

ఆశగా తలతిప్పి, తలుపువైపు చూసాను.. ఈవేళప్పుడు నాకోసం వచ్చేదెవరా అని!

నాకూతురు నీరజ! చివరి క్షణాల్లో ఉన్న నన్ను చూడాలని నా కూతురికైనా అనిపించినందుకు సంతోషించాను.

నీరజ మంచం పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది. ఏదో మాట్లాడాలని వచ్చి.. చెప్పలేక మొహమాటపడుతోంది. మాట్లాడలేని నేను, ఏవిటో చెప్పమన్నట్టు ప్రేమగా చూసాను.

చిన్నప్పటి నీరజ గుర్తొచ్చింది. ఎంత అల్లారుముద్దుగా పెంచాను.. తనని, కాలుకింద పెడితే కందిపోతుందేమోనన్నట్టుగా-

నీరజ గొంతు సవరించుకుంది.

".. ఏం లేదు నాన్నగారూ! అవినాష్ మెడిసిన్ చదువుతానంటున్నాడు. డొనేషన్ కట్టాలి. 'అనిల' చదువుపూర్తయింది. పెళ్ళి చేయాలి. ఆ పొలం నాకిస్తే.. ఈ ఖర్చులన్నిటికీ కాస్త కలిసి వస్తుంది. మీరు వీలునామా రాసే వుంచారనుకోండి..." చివరి మాటలు నసుగుతూ అంది.

నాకు మాట పడిపోయినందుకు ఆ క్షణంలో చాలా ఆనందించాను. ఆప్యాయతకీ, అనుబంధాలకీ అర్థం తెలియని మనుషులతో మాట్లాడేకంటే నోరు మూగబోవడమే మంచిది.

చివరి క్షణాల్లో ఉన్న నాతో డబ్బు- ఆస్తి గురించి మాట్లాడకపోతే, "ఒంట్లో ఎలా వుంది నాన్నగారూ..?" అని ప్రేమగా ఒక్కమాట అడగొచ్చుకదా!

నీరజ నావైపే చూస్తోంది.. సమాధానం కోసం!

'సరే' అన్నట్టుగా తలూపి.. కళ్ళు మూసుకున్నాను. నా కూతురు అక్కడి నుండీ మెల్లిగా వెళ్ళిపోవడం, కళ్ళు మూసుకున్నా నాకు తెలుస్తూనేవుంది.

కళ్ళు తెరిచాను.

నేనూ, ఈ నిశ్శబ్దమూ.. అదిగో గోడమీద ఆ బల్లి.. నా ఒంటిమీద వాలిన ఈగ..

అంతే! మరెవరూ లేరు.. రారు! ఈ నరకయాతన అనుభవిస్తేగానీ తెలీదు.

నా తండ్రి కూడా అప్పుడిలాగే ఆలోచించి వుంటాడా? మృత్యువు అడుగుల సవ్వడి కోసం ఎదురుచూస్తూ.. 'ఈ ప్రాణం ఇంకా పోదేం..!' అనుకొని వుంటాడా?

విచ్ఛిన్నమౌతున్న బంధాలకన్నా గొప్పదా ప్రాణం..

ధ్వంసమైన నమ్మకం కన్నా గొప్పదా ప్రాణం..

– అని విరక్తి చెందివుంటాడా?

'మానవ సంబంధాల మధ్య అంతర్వాహినిలా ప్రవహించాల్సిన ప్రేమని ఏమాత్రం ఫీలవ్వని మనుషులకోసం మనసుపాడుచేసుకోవడం తగని పని..' అనుకొని వుంటాడా?

అర్ధరాత్రి దాటింది.

లోపలి నుండీ ఇంకా మాటలు వినిపిస్తూనే వున్నాయి. టి.వి. మోగుతూనేవుంది.

నాగది పక్కనున్న గదిలో చిన్నకొడుకూ, కోడలూ పడుకున్నట్టున్నారు. మాటలు మెల్లగా అయినా స్పష్టంగా వినబడుతున్నాయి.

''వీలునామా గురించి మీ నాన్నని అడగరా?'' కోపంగా అడుగుతోంది సరళ.

''అడిగేదేముంది? ముగ్గురికీ సమానంగా రాసివుంటారు'' చిన్నకొడుకు భాస్కర్ జవాబు.

''ఏం కాదు. పొలం అంతా మీ చెల్లెలికి రాసి వుంటాడు.''

''రేపొద్దున్న ఆయన్నే అడుగుతాలే.. ఇప్పుడెందుకూ గొడవ?''

ఈ ఇంట్లో ఎప్పుడూ ఆస్తి గురించి, ఇంకా పోని నా



ప్రాణం గురించిన చర్చలే!

వద్దు..!

ఇక నేనీ మాటలు వినలేను. ఈ రాత్రి నా జీవితానికి చివరి రాత్రి అయితే ఎంత బావుండును!

ఒక్కసారి నా మనవడిని పిలిచి, వాడితో మాట్లాడాలనిపిస్తోంది.

''మనీకన్నా, మెటీరియలిజంకన్నా, ముఖ్యమైంది ఈ ప్రపంచంలో ఇంకా చాలా వున్నాయనీ.. వాటి పేరే బంధాలని.. అనుబందాలని.. వాటికి కాస్త విలువనిచ్చి, చరిత్ర పునరావృతం కానివ్వవద్దని..'' ఇంకా చాలా చాలా వాడితో చెప్పాలనివుంది.

నా మనవడికి నా దగ్గరకి రావడానికే అసహ్యం. నా గదిలోకి ఎప్పుడోగానీ రాడు.

''మనుషుల మధ్య అనురాగాలు.. అనుబంధాలు ముఖ్యమని గుర్తించలేకపోవడం కేవలం మానసిక అంధత్వం..'' అని గొంతు పెగలని నేను, గొంతు చించుకు మరీ అరవాలనిపిస్తోంది.

ప్రపంచంలో అనేక రకాల బాధలూ, దుఃఖాలూ వుండొచ్చు. మనిషి ఎదుగుదలలో వాటి అవసరమూ వుండొచ్చు. కానీ కేవలం నిర్లక్ష్యంవల్ల, బాధ్యతా రాహిత్యం వల్లా మనిషిని మనిషి పెట్టే బాధ నరకప్రాయం!

మనిషి వయస్సు నాలుగుదశలు! మొదటి మూడు దశలూ ఒకదాని తర్వాత మరొకటి వుందనే ధైర్యంతో సాగిపోతాయి. కానీ చివరిదైన నాలుగోదశ తర్వాత మరోదశ లేదు. అండ లేదు. అందుకే కాబోలు అది మనిషిని పూర్తి ఒంటరిని చేస్తుంది.

నిజంగా ఆత్మవంచన లేనివాడైతే ఈ చివరిక్షణాల్లో గర్వపడాలి! నవ్వుకోవాలి. కానీ.. నాలో? ఆ గర్వంలేదు. నవ్వు లేదు. కేవలం నిర్లిప్తత, నిర్వికారం తప్ప! ఏదో బాధ.. వ్యధ నన్ను ఎటో లాక్కుపోతున్నట్టుగా వుంది. కళ్ళముందు కమ్ముకున్న చీకటి చిక్కగా, బరువుగా మరి రెప్పల్ని మరిక ఛేదించలేని ఇనుప సంకెలలా మారి మెల్లమెల్లగా బిగుసుకుంటోంది.

ఇది నిద్రా? కాదు!

ఒక గాఢనిద్రలోకి జారి పోబోయేముందు కలిగే అచేతనావస్థ!

ఇదేనా మరణమంటే? అయితే ఎంత బావుండును!

మరణం తర్వాత భగవంతుడు కనిపించే మాట నిజమే అయితే, ఆయన్ని కొన్ని సందేహాలు అడగాలి. కలుషితమైపోతున్న ఈ లోకం గురించి చెప్పాలి.

మానవ సంబంధాల్లోకి పుచ్చు వచ్చి చేరింది. అమూల్యమైన దేదో జారిపోతున్నది. అని చెప్పాలి! ఒక మనిషి కోసం ఆలోచించే మరోమనిషి కరువైపోతున్నాడు. అని చెప్పాలి. స్వార్థం.. ఎటు చూసినా స్వార్థం.. లోకరీతిలోంచి అమ్మదనం.. కమ్మదనం నిష్క్రమిస్తున్నాయి.. అని చెప్పాలి!

''భగవంతుడా! ఈ మనుషుల్ని మనుషులుగానే వుంచు. మృగాలుగా మారనీయకు. మనిషికీ మనిషికీ మధ్యవున్న బంధాలు వదులైపోతున్నాయి. బిగుంచు! తల్లి-తండ్రి, అన్న-చెల్లి, అక్క-తమ్ముడు.. ఈ బంధాలను సడలించకు. వాటిని రాగరంజితం చెయ్యి! కొంచెం ప్రేమ, కొంచెం ఆప్యాయత, కొంచెం నిస్వార్థం ఈ మనుషులందరిలో ప్రవేశపెట్టు- నీ అంశని ఈ మనుషుల్లో కొద్దిగానైనా నింపు..'' కళ్ళు మూతలు పడిపోయినా మనసు భగవంతుణ్ణి వేడుకుంటూనే వుంది.

అలసటగా వుంది. చాలా అలసటగావుంది.

మూతలుపడ్డ ఈ కళ్ళు తిరిగి తెరుచుకోకూడదని నా కోరిక. ఇది నా జీవితానికి ఆఖరి రాత్రి కావాలి.

అవును!

మూతలు పడుతున్న నా కళ్ళ సాక్షిగా ఇది నాకు చి..వ..రి..రా..త్రి!

★